క్లుప్తంగా

స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణలో పాల్గొనే మహిళా సంఘాలు, ఇతర ఎన్‌జీఓలు స్వచ్ఛత అవార్డులకు ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపికైన వారికి మహిళా ఐకాన్ ప్రముఖ స్వచ్ఛత(డబ్ల్యూఐఎస్‌ఎస్)–2023 అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. వీటికి వ్యక్తిగత మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక బృందాలు, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, స్టార్టప్‌లు, ఎన్‌జీఓలు అర్హులన్నారు. కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే సేవలు, చికిత్స సౌకర్యాలు–వాడిన నీరు, సెప్టేజ్, మున్సిపల్ వ్యర్థాల సేకరణ, రవాణా, ఎంఆర్‌ఎఫ్ ఆపరేషన్, వృథా నుంచి సంపద ఉత్పత్తులు, ట్రీట్‌మెంట్ సౌకర్యాలు- ఘన వ్యర్థాల నిర్వహణ, ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్, ట్రైనింగ్ కెపాసిటీ బిల్డింగ్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ తదితర కార్యక్రమాల్లో పాల్గొని ఉండాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను స్థానిక మెప్మా కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌కు..

నవాబుపేట: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5 నుంచి పదో తరగతి చదివే వారికి ప్రభుత్వం స్కాలర్‌షిప్ పొందే అవకాశం కల్పించిందని మండల ప్రత్యేక అధికారి సురేందర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 15వ తేదీలోపు మండల పరిధిలోని విద్యార్థులు అందరూ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేలా ఆయా పాఠశాలల విద్యార్థులు చొరవచూపాలని సూచించారు. కార్యక్రమంలో తాహసీల్దార్ రాజేందర్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీలత, ఏపీఓ జ్యోతి, ఎంఈఓ రాజు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

మహబూబ్‌నగర్ రూరల్: సమాజ మార్పు కోసమే సావిత్రిబాయి పూలే పుట్టారని జ్ఞాన నీలిమెరుపు బహుజన మహనీయులు శోభాయాత్ర కమిటీ నాయకులు కొనియాడారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాతపాలమూరు జై భీమ్ చౌరస్తాలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దళిత బహుజన నాయకులు మాట్లాడారు. సమాజంలో మూఢనమ్మకాలు, అంటరానితనం, వివక్షకు వ్యతిరేకంగా సావిత్రీబాయి పూలే పోరాటాలు చేశారని గుర్తుచేశారు. సామాజిక మార్పు, స్వేచ్ఛా సమానత్వం కోసం మహిళా సేవ మండల్ అనే మహిళా సంఘాన్ని కూడా ఆమె ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాసులు, శోభాయాత్ర జిల్లా కమిటీ కన్వీనర్ పాతూరి రమేష్, ప్రతినిధులు డాక్టర్ నాగయ్య, రాయికంటి రాందాస్, సింగిరెడ్డి పరమేశ్వర్, రాములు, పురుషోత్తం, జె.బాలరాజు, పి.బాలయ్య, దిలీప్‌కుమార్, దినేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మహబూబ్‌నగర్ జై భీమ్ చౌరస్తాలో నివాళి అర్పిస్తున్న దళిత, బహుజన సంఘాల ప్రతినిధులు

జడ్చర్ల టౌన్: సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం జడ్చర్లలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. బీసీ సేన ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సేన మండల అధ్యక్షుడు నిరంజన్, బీసీ సేన కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడారు. అణగారిన జీవితాల్లో అక్షరదీపం వెలిగించి అజ్ఞానపు చీకట్లను తొలగించిన చదువుల తల్లిగా కొనియాడారు. శేఖర్, చంద్రమౌళి, సురభి రఘు, రాఘవేందర్‌లు పాల్గొన్నారు.

- ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ శిబిరంలో సావిత్రీబాయి పూలే చిత్రపటం ఏర్పాటు చేసి నివాళి అర్పించారు.

దేవరకద్ర: దేశంలో మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం దేవరకద్రలో ఘనంగా నివాళి అర్పించారు. దేవరకద్రలోని దళితవాడ కమ్యూనిటీ హాలులో సావిత్రీబాయి చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ మార్కెట్ చైర్మన్ ఆంజనేయులు, బాలకృష్ణ, రమేశ్, దినేష్, దిలీప్‌కుమార్, రాజు పాల్గొన్నారు.


జడ్చర్లలో నివాళి అర్పిస్తున్న బీసీసేన నాయకులు


దేవరకద్రలో...

దోమల నివారణకు ఫాగింగ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వివిధ వార్డుల్లో కొన్ని రోజులుగా దోమల నివారణకు మున్సిపల్ సిబ్బంది మస్కిటో ఫాగింగ్ చేపట్టారు. ఆయా గల్లీల్లో ప్రత్యేక వాహనంలో ఫాగింగ్ మిషన్ ద్వారా స్ప్రే చేస్తున్నారు.

వాటరింగ్ డే..

మున్సిపాలిటీ పరిధిలో ప్రతి శుక్రవారం వాటరింగ్ డే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బృందావన్‌కాలనీలోని నర్సరీలో మొక్కలకు మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ నీరు పట్టారు. అనంతరం బైపాస్ రోడ్డు వెంట నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కలను సంరక్షించాలని సిబ్బందికి సూచించారు.


షాషాబ్‌గుట్టలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం


బసవేశ్వర స్వామి దేవాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

నవాబుపేట: మండల పరిధిలోని పల్లెగడ్డలో వెలిసిన ఆదిబసవేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా నవాబుపేటకు చెందిన డా.శ్రీనివాస్ సరస్వతీ దంపతులు పట్టు వస్త్రాలు, తాళి, తలంబ్రాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి భజన పోటీల్లో గెలుపొందిన గురుకుంట భజన బృందానికి ప్రథమ బహుమతిగా రూ.10 వేల నగదు అందజేశారు. పూజారి శ్రీశైలం, ఉత్సవ నిర్వాహకులు జంగయ్య, రాజలింగం, సరస్వతీ, రవి, ప్రతాప్ పాల్గొన్నారు.


మహాసభలో పాల్గొన్న క్రైస్తవులు

ముగిసిన సువార్త స్వస్థత మహాసభలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఎంబీసీ మైదానంలో ఇమ్మానుయేల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సువార్త స్వస్థత మహాసభలు శుక్రవారం రాత్రి ఘనంగా ముగిశాయి. చివరి రోజు మహాసభల్లో ఇమ్మానుయేల్ మినిస్ట్రీస్ నిర్వాహకులు పాస్టర్ బి.జెర్మియా ప్రసంగించారు. ఈ మూడు రోజుల శక్తివంతనమైన వాఖ్యాన్ని ప్రతిఒక్కరూ స్వీకరించి దేవునికి ఇష్టంగా రాణించాలన్నారు. ఎలాంటి అనారోగ్య బాధలు ఉన్నా దేవునిపై విశ్వాసం ఉంటే తొలగిస్తాడని తెలిపారు. దేవుని వాఖ్యాన్ని ప్రతిరోజూ ధ్యానించాలని, ఆయనపై విశ్వాసంగా ఉండాలని సూచించారు. అనంతరం వివిధ రోగాల బారిన పడిన వారు కోలుకోవాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంబీసీ చైర్మన్ రెవ.వరప్రసాద్, రెవ.బీఎస్.పరంజ్యోతి, రెవ.సుందర్‌పాల్, యేసుపాదం, జాన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న జెర్మియా

‘నారాయణ’ సేవలు మరువలేనివి


నివాళి అర్పిస్తున్న నాయకులు

అడ్డాకుల: నక్సల్స్ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన దివంగత ఎంపీపీ కందూర్ నారాయణ వర్ధంతిని శుక్రవారం అడ్డాకులలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. అడ్డాకుల జూనియర్ కళాశాలలో కార్యక్రమం ముగించుకుని వెళ్తున్న ఉమ్మడి అడ్డాకుల ఎంపీపీ నారాయణపై నక్సల్స్ జరిపిన కాల్పుల్లో మృతి చెందడంపై సంతాపం వ్యక్తం చేస్తూ.. బస్టాండ్ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల అభివృద్ధికి నారాయణ చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. సర్పంచ్ మంజుల, భీమన్నయాదవ్, బాలకృష్ణ, శేఖర్, బాలన్న, బొడ్డు వెంకటేష్ పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలపై అవగాహన


మాట్లాడుతున్న సీహెచ్‌ఓ రామయ్య

భూత్పూర్: ప్రజలు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాలల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సీహెచ్‌వో రామయ్య అన్నారు. శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆశ డే సందర్భంగా పలు సూచనలు చేశారు. ప్రజలు అవసరమైతేనే బయటకు వెళ్లాలని, సాధ్యమైనంత వరకు కాటన్ దుస్తులు ధరించాలని, ఓఆర్‌ఎస్‌ను నీటి కలుపుకొని వాటర్‌బాటిల్‌ను వెంట తీసుకొని వెళ్లాలని ప్రజలకు తెలియజేయాలని సీహెచ్‌ఓ రామయ్య వివరించారు. వేసవి కాలంలో వడదెబ్బకు గురవుతారని, ఎండలో తిరిగేటప్పుడు తలపాగా ధరించాలని, ఎక్కువగా దాదాపు 5 లీటర్ల మేర నీటిని రోజాంతా తాగాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేసే ఆశ కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్ యాదమ్మ, పబ్లిక్ హెల్త్ నర్స్ ఎలిజబెత్‌రాణి, ఎస్.ప్రవీణ కుమారి ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీక

- నేటి నుంచి అబ్దుల్ రహమాన్(మాసన్న) ఉర్సు
- మూడు రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు
- వివిధ రాష్ట్రాల నుంచి హాజరుకానున్న భక్తులు

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లిలో వెలిసిన అబ్దుల్ రహమాన్(మాసన్న) ఉర్సు కుల మతాలకు అతీతంగా మూడు రోజుల పాటు వైభవంగా కొనసాగనుంది. శనివారం నుంచి ప్రారంభం కానున్న ఈ ఉత్సవాలకు ఉమ్మడి పాలమూర్ జిల్లాతో పాటు హైదరాబాద్, ఇతర జిల్లాలు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు హాజరుకానున్నారు. అందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే దర్గాకు రంగులు అద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు. వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వసతి ఏర్పాట్లు, తాగునీటి, పారిశుద్ధ్యం వంటి పనులు చేపట్టారు.

కార్యక్రమాలు ఇలా...

11వ తేదీన శనివారం గ్రామంలోని దర్గా నిర్వాహకులు శంకర్ ఇంటి నుంచి కిలోమీటర్ దారిపొడువున మేళతాళాల మధ్య గంధం ఊరేగింపుగా తీసుకొస్తారు. అలాగే 12న ఆదివారం చిరాకి(దీపాలంకరణ)ను పురస్కరించుకొని దీపాలు, కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం బాణాసంచా కాలుస్తూ.. అదేరోజు ఖవాలి గానం నిర్వహిస్తారు. 13న సోమవారం దివ్యఖురాన్(ఫాతేహాలు) పటిస్తారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

హాజరు కానున్న పీఠాధిపతి..

ఉత్సవాలకు హైదరాబాద్ సయ్యద్ సుల్తాన్ అలీషా దర్గా పీఠాధిపతి సయ్యద్ నిజామోద్దీన్ హారుని, తాండూర్ హజ్రత్ సయ్యద్ అబ్దుల్ ఖరీంషా దర్గా పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ సాబేర్ పాషా, దుప్పల్లి రాంచంద్రయ్య దర్గా పీఠాధిపతులు సుకుమార్ గౌడ్, కరుణాకర్ గౌడ్, రవి గౌడ్ హాజరు కానున్నారు.


ఉత్సవాలకు ముస్తాబైన అబ్దుల్ రహమాన్ దర్గా

గులాబీ పూలే ప్రత్యేకం..

మూడు రోజుల పాటు దర్గా ప్రాంతం గులాబీ పూల గుమగుమలతో పులకరిస్తుంది. ఉర్సుకు ప్రత్యేకంగా బెంగళూర్ నుంచి గులాబీ పూలు(చాదర్), హైదరాబాద్ నుంచి గలీఫాను తెప్పిస్తారు. ఉర్సు కార్యక్రమానికి దాదాపుగా 5వేల మంది భక్తులు హాజరు కానున్నట్లు నిర్వాహకులు శంకర్, సుదర్శన్, కమలాకర్, భగవాన్ తెలియజేశారు.

నేటి నుంచి హజ్రత్ ములుక్ బాద్‌షా ఉత్సవాలు..

హన్వాడ: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా వెలుగొందుతున్న హజ్రత్ ములుక్ బాద్‌షా, హజ్రత్ మలక్ బాద్‌షా ఆరో ఉర్సు మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండల పరిధిలోని గుడిమల్కాపూర్ గ్రామ శివారులోని భారీ మర్రి వృక్షాల మధ్యలో వెలిసిన హజ్రత్ ములుక్ బాద్‌షా, హజ్రత్ మలక్ బాద్‌షాల ఉర్సును హిందూ, ముస్లింలు కుల మతాలకతీతంగా కొనసాగనుంది. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి, మహబూబ్‌నగర్ పట్టణం, నవాబుపేట, నాగర్‌కర్నూల్, కోస్గి, కొడంగల్, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.

అన్నిరంగాల్లో రాణించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందని పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ పేర్కొన్నారు. ఈ మేరకు పీయూ లైబ్రెరీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారి ప్రతిభను గుర్తించినప్పుడే మహిళలు ఉన్నత స్థానానికి ఎదిగేందుకు అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రార్ గిరిజ, అధ్యాపకురాలు మనోజ, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని వార్డుల్లో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైఎస్‌ఆర్‌టీపీ అసెంబ్లీ కో ఆర్డినేటర్ రవిప్రకాష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ రవికుమార్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పలు వార్డుల్లో పారిశుద్ధ్యం పడకేసిందని, ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. డ్రెయినేజీలు ఇళ్ల మధ్యలో పారుతున్నా.. పట్టించుకునే వారు లేరన్నారు. సునీల్, ముకుందాచారీ, అయుబ్ పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు ఇవ్వాలని వినతి


మూసాపేటలో ఎంపీడీఓకు వినతి అందజేస్తున్న కురుమూర్తి

అడ్డాకుల: పెండింగ్‌లోని పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాల చెల్లింపుతో పాటు కార్మికుల ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం మూసాపేట మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించి, తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ స్వరూపకు వినతి అందజేశారు. కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా వర్తింపజేయాలని, హెల్త్‌కార్డులను పంపిణీ చేయాలని కురుమూర్తి డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 13న కలెక్టర్ కార్యాలయం వద్ద వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తామని తెలియజేశారు. మధు, బాలనర్సింహ, నాగయ్య తదితరులు ఉన్నారు.

నాటక రంగాన్ని పరిరక్షించుకుందాం..


పోస్టర్ ఆవిష్కరిస్తున్న శివకుమార్

జడ్చర్ల టౌన్: నాటక రంగాన్ని పరిరక్షించుకుందామని రాష్ట్ర సంగీత నాటక అకాడమి మాజీ చైర్మన్ బి.శివకుమార్ పిలుపునిచ్చారు. శోభకృతు నామసంవత్సరం ఉగాది పురస్కరించుకుని నవజ్యోతి కళానిలయం ఆధ్వర్యంలో మిడ్జిల్ మండలం కొత్తపల్లిలో ప్రదర్శించనున్న సత్యహరిశ్చంద్ర, శ్రీకృష్ణరాయబారంలోని శయనదృశ్యం నాటకం పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. పట్టణంలోని నవజ్యోతి కళానిలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాటక రంగానికి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తమ ప్రభుత్వం పెద్దపీట వేసిందని గుర్తుచేశారు. నాటక ప్రదర్శన చేసే వారిని ప్రోత్సహించేందుకు తాను ఎప్పుడు ముందుంటానన్నారు. పదికాలాల పాటు నాటకాన్ని నిలపాలంటే ప్రజలు సైతం ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 21న కొత్తపల్లిలో ప్రదర్శించనున్న నాటకాలకు నాటకాభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కళానిలయం సంగీత దర్శకుడు మాధవరాజు, దామోదర్, కృష్ణ, నరేష్, శ్రీను, సత్యం పాల్గొన్నారు.

సంగాయపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన

మహమ్మదాబాద్: మండల పరిధిలోని సంగాయపల్లిలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభం, గ్రామంలో బొడ్రాయి మహోత్సవాలను శుక్రవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి బంధువులు, ఆడపడుచుల రాకతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో సర్పంచ్ చందర్, కార్యదర్శి కీర్తిరెడ్డి, గ్రామపెద్దలు వెంకటయ్య, గోపాల్, శ్రీను, బాల్‌రాజు, వెంకటయ్య, గంగాపురి, చెన్నయ్య, వెంకట్రాములు, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌లైన్‌లో ఎన్నికల ప్రచారం

స్టేషన్ మహబూబ్‌నగర్: టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన హర్షవర్ధన్‌రెడ్డిని ఉపాధ్యాయులు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి కోరారు. అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి మధుసూదన్‌రెడ్డి శుక్రవారం జిల్లా కేంద్రం పోలీస్‌లైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను కలిసి ఓట్లు వేయాల్సిందిగా అభ్యర్థించారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. డీఏలు, జీతాల విషయంలో ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందని ఆరోపించారు.

అధిక మెజార్టీతో గెలిపించండి

బాలానగర్: పీఆర్‌టీయూ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర సభ్యులు స్వప్న, ఊర్మిల, అనిత, లక్ష్మి మండల పరిధిలోని వివిధ పాఠశాలలో ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మండల పరిధిలోని వివిధ పాఠశాలలో మండల అధ్యక్షుడు దివాకర్, ప్రధాన కార్యదర్శి సరేందర్ రెడ్డితో కలిసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్‌టీయూ అభ్యర్థి గర్రం చెన్నకేశవ రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించి పిలుపునిచ్చారు. బద్రినాథ్, రామ్‌కిషన్ రావు, అయ్యపు రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారుల అప్పగింత

స్టేషన్ మహబూబ్‌నగర్: కోయిలకొండకు చెందిన ఓ వృద్ధురాలు ఐదుగురు మనవరాళ్లతో కలిసి మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి తమ సొంత గ్రామానికి వెళ్లడానికి బస్సు ఎక్కే సమయంలో ఇద్దరు మనవరాళ్లు తప్పిపోయారు. బస్టాండ్‌లో చిన్నారులు ఏడుస్తుండగా.. గమనించిన అక్కడి వారు ఐసీడీఎస్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వారికి సమాచారం ఇచ్చారు. బస్టాండ్‌కు సీడబ్ల్యూసీ వారు చేరుకోగా.. అప్పటికే చిన్నారుల నాయనమ్మ, ఇతర కుటుంబ సభ్యులు చేరుకున్నారు. సీడబ్ల్యూసీ ద్వారా చిన్నారుల వివరాలు సేకరించి నాయనమ్మ, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోగులకు మజ్జిగ పాకెట్లు పంపిణీ

పాలమూరు: ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా జనరల్ ఆస్పత్రిలో రోగులకు మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంకిషన్ హాజరై రోగులకు మజ్జిగ పాకెట్లు అందజేశారు. శ్రీనివాసులు, స్వాతి, ఇమాన్యుయేల్ పాల్గొన్నారు.

టిప్పర్ పట్టివేత

మిడ్జిల్: మండల కేంద్రంలోని దుందుబి వాగు నుంచి శుక్రవారం ఇసుక తరలిస్తున్న టిప్పరును రెవెన్యూ అధికారులు పట్టుకొని విచారించగా.. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో టిప్పరును పోలీసులకు అప్పగించారు.

ఘనంగా స్వయంపాలన


దేవరకద్రలో..


ధర్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని ధర్మాపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. తోటి విద్యార్థులకు బోధించి అతిథులను ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి బహుమతి ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని అనూష కాన్వెంట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు.

మిడ్జిల్: మండల పరిధిలోని మసిగొండ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు.